విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మెదక్‌లో రూ.45 కోట్లతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే రోహిత్‌రావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

మెదక్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): విద్య, వైద్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నామని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీపీఆర్‌వో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మెదక్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రూ.45 కోట్లతో మెదక్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 61 పాఠశాలల్లో మరుగుదొడ్లు మంజూరు చేశామన్నారు. ఏడుపాయల్లో రూ.80 లక్షలతో శాశ్వత షెడ్డు నిర్మించామన్నారు. మెదక్‌లో మెడికల్ కళాశాలతో పాటు ఏరియా దవాఖానలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. పట్టణంలోని కొంటూరు చెరువు, గోసముద్రం చెరువుల సుందరీకరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మెదక్‌లో ఇండస్ట్రీల ఏర్పాటుకు, ఫార్మా, సోలార్, టెక్స్‌టైల్స్ పరిశ్రమలను తీసుకురావడానికి కృషి చేస్తున్నానన్నారు. రామాయంపేటలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు ఆవారి శేఖర్, నర్సా లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు బొజ్జ పవన్, మేడి గణేశ్, మహేందర్‌రెడ్డి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో స్టడీ హాల్ ప్రారంభం

తూప్రాన్, అక్టోబర్ 23: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ టోల్ ప్లాజా గురుకుల పాఠశాల వద్ద ఐటీసీ పరిశ్రమ సహకారంతో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన స్టడీ హాల్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం ప్రారంభించారు. ఆయనతో ఐటీసీ డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్, ఆర్డీవో జయచంద్రారెడ్డి ఉన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు ఢీకొని విద్యార్థిని మృతి

మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు ఇన్‌సెట్‌లో అశ్విని(ఫైల్)

పెద్దశంకరంపేట, అక్టోబర్ 23: స్కూల్ నుంచి ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో విద్యార్థినిని బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం జరిగింది. అల్లాదుర్గం సీఐ రేణుకా రెడ్డి కథనం ప్రకారం.. లక్ష్మాపురం గ్రామానికి చెందిన బోయిని చందు, సరితకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చందు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. వారి పెద్దకూతురు బోయిని అశ్విని (6). పెద్దశంకరంపేటలోని సాయిచైతన్య ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్నది. రోజు మాదిరిగానే బుధవారం బస్సులో పాఠశాలకు వెళ్లి, తిరిగి వచ్చింది. అశ్విని బస్సు దిగగానే ఇంటికి వెళ్లేందుకు ముందుకెళ్లింది. బస్సు డ్రైవర్‌కు బాలిక కనిపించకపోవడంతో బస్సు అశ్వినిని ఢీకొట్టింది. దీంతో విద్యార్థిని అక్కడికక్కడే మృతిచెందింది. డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తెలుసుకున్న గ్రామస్తులు బస్సుపై దాడి చేసి అద్దాలు, కిటికీలను ధ్వంసం చేశారు. ఘటనా స్థలానికి అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పేట ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ సునీత చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పాఠశాల యాజమాన్యంపై, బస్సు డ్రైవర్‌పై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్తత

కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన

కౌడిపల్లి, అక్టోబర్ 23: కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట మండలంలోని రాజపేట జాజితండాకు చెందిన తండావాసులు బుధవారం ఆందోళనకు దిగారు. జాజితండాకు చెందిన గిరిజన మహిళ ఈనెల 22న కరెంటు షాక్‌తో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు కౌడిపల్లికి భారీ సంఖ్యలో చేరుకుని నిందితులను తమకు అప్పగించాలని, లేదంటే నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళనకు దిగారు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పోలీసు బలగాలను రప్పించారు. బాధితులకు ఎంత చెప్పినా వినకపోవడంతో నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి జోక్యం చేసుకుని న్యాయం చేస్తామన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సేంద్రియ ఆకుకూరలను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

నర్సాపూర్, అక్టోబర్ 23: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. బుధవారం మండలంలోని పెద్దచింతకుంట జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి, సమ్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలను పర్యవేక్షించారు. ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించాలన్నారు. విద్యార్థులు నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్‌ను సందర్శించారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలను విద్యార్థులు డీఈవోకు అందజేశారు. ఆయనతో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ రామేశ్వర్ ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి ఉన్నారు.

ప్రతి గ్రామంలో నర్సరీ తప్పనిసరి

చిలిపిచెడ్, అక్టోబర్ 23: మండలంలోని ప్రతి గ్రామంలో నర్సరీ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శిదేనని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు.

డ్రిప్ పైపులు దగ్ధం

నిజాంపేట,అక్టోబర్23: గుర్తుతెలియని వ్యక్తులు డ్రిప్ పైపులను దగ్ధం చేసిన ఘటన నస్కల్ గ్రామంలో బుధవారం జరిగింది. నగేశ్ తన పొలం వద్ద పంట కోసం డ్రిప్ పైపులను ఒక చోటు భద్రపరుచుకున్నాడు. రోజు మాదిరిగానే నగేశ్ బుధవారం పొలం వద్దకు వెళ్లి చూడగా డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. దీంతో తనకు సుమారు రూ.50 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏడుపాయల హుండీ లెక్కింపు

పాపన్నపేట, అక్టోబర్ 23: ఏడుపాయల వనదుర్గాభవానీ దేవి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 83 రోజులకు రూ.39లక్షల 91 వేల 361ల ఆదాయం వచ్చినట్లు ఏసీ సుధాకర్‌రెడ్డి, ఈవో చంద్రశేఖర్ తెలిపారు. శ్రీరాజరాజేశ్వరిసేవాసమితి ఆధ్వర్యంలో గోకుల్ షెడ్‌లో లెక్కించారు. సిబ్బంది సూర్య శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి శ్రీనివాస శర్మ యాదగిరి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, DODLE JYOTHI, Previously Call as S.JYOTHIRAMAI, R/o. Flat No. 302, Sri Sai Gruha Apartments, Citizen Colony, Indresham (V), Patancheru (M), Sangaredy (D), TS-502 319, hereby inform that I Changed MyName as DODLE JYOTHI for all purpose.

NT-320159

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్రియాములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

శివ్వంపేట: చెన్నాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చేగుంట: నార్సింగి మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నిజాంపేట: తిప్పనగుల్లలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డైరెక్టర్ లక్ష్మారెడ్డి

సకాలంలో ధాన్యం కొనాలి

- కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

శివ్వంపేట, అక్టోబర్ 23: ధాన్యాన్ని సకాలంలో కొనాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదేశించారు. బుధవారం మండలంలోని చండి, లచ్చిరెడ్డిగూడెం, నవాబ్‌పేట, చెన్నాపూర్, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం వరి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మస్సూర్, ఎంపీడీవో నాగేశ్వర్, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ బోళ్ల భారతి భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు యాదాగౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, లాయక్, చింతస్వామి, ప్రభాకర్ రెడ్డి, రాంచందర్‌గౌడ్, భిక్షపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా

నర్సాపూర్, అక్టోబర్ 23: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసానిస్తుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన ఎస్.రామరాజుకు రూ.60 వేలు, నర్సాపూర్ పి.కిష్టయ్యకు రూ.60 వేలు, తుజాల్‌పూర్ శ్రీశైలంకు రూ.60 వేల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమోద్దీన్, బీఆర్ఎస్ నాయకుడు సత్యంగౌడ్, మాజీ సర్పంచ్ గాలి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నది

చేగుంట, అక్టోబర్ 23: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నార్సింగి మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మైలరం బాబు, వైర్మన్ శశిధర్‌రెడ్డి, నర్సింహాచారి, బిక్యానాయక్, గుర్రాల స్వామి, సత్యం, సీవో నర్సింహులు తదితరులున్నారు. చేగుంట సొసైటీ పరిధిలోని అనంతసాగర్, వడియారం గ్రామాల్లో చేగుంట సొసైటీ చైర్మన్ బోనగిరి బాగులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.

నిజాంపేటలో..

నిజాంపేట,అక్టోబర్23: మండలంలోని తిప్పనగుల్ల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రామాయంపేట పీఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి ప్రారంభించారు.

ఝాన్సిలింగాపూర్‌లో..

రామాయంపేట, అక్టోబర్ 23: మండలం ఝాన్సీలింగాపూర్ గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

వెల్దుర్తిలో..

వెల్దుర్తి, అక్టోబర్ 23: మండలంలోని మనేపల్లి, మంగళపర్తి, యశ్వంతరావుపేట, మన్నెవారి జలాల్‌పూర్, కుకునూర్, దామరంచ, ధర్మారం, అందుగులపల్లి గ్రామాల్లో వెల్దుర్తి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి ప్రారంభించారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి సహకార సంఘం ఆధ్వర్యంలో చందాపూర్, అంబాజిపేట, జంగరాయి, గవ్వలపల్లి, కొర్విపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

చిన్నశంకరంపేట, జంగరాయిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

వెల్దుర్తి: కుకునూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి

రామాయంపేట: ఝాన్సీలింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ పథకాలు ప్రతిఇంటికీ అందాలి

ఎల్లయ్య అవగాహన కల్పించారు.

రామాయంపేట, అక్టోబర్ 23:ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు ప్రతి ఇంటికి అందించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిపై ఉంటుందని ట్రైనీ ఐఏఎస్‌ల బృందం పేర్కొన్నారు. బుధవారం రామాయంపేట మండలం డి.ధర్మారంలోని పీహెచ్‌సీ, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు.

రాయిలాపూర్‌లో 3వ రోజు

కౌడిపల్లి, అక్టోబర్ 23: మండలంలోని రాయిలాపూర్‌లో మూడో రోజు ట్రైనీ అధికారులు పర్యటించారు. గ్రామంలో అమలవుతున్న పథకాల పనితీరును పరిశీలించి డేటా సేకరించారు. పథకాల గురించి జడ్పీ సీఈవో

మల్కాపూర్ ను ఆదర్శంగా తీసుకోవాలి

తూప్రాన్, అక్టోబర్ 23: మండలంలోని మల్కాపూర్ అద్భుతంగా ఉందని, ఆదర్శ గ్రామమని ట్రైనీ సివిల్ సర్వీసెస్ అధికారులు పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 23 వరకు గ్రామంలో పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పరిశీలించారు.

మంత్రిని కలిసిన ట్రాన్స్‌కో డీఈ

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 23: మెదక్ ట్రాన్స్‌కో డీఈగా బాధ్యతలు చేపట్టిన చాంద్ షరీఫ్ భాషా బుధవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను హైదరాబాద్‌లో కలిశారు. మెదక్ డివిజన్‌లో విద్యుత్తు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, అల్లాదుర్గం మండలంలో సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని డీఈకు మంత్రి ఆదేశించారు.

జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 23: జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మెదక్ ఆర్డీవో రమాదేవి బుధవారం సందర్శించారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు సలహాలు సూచనలు ఇచ్చాయన్నారు. పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణకు సూచించారు.

కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ధర్నా

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 23: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు కలెక్టరేట్ గేట్ వద్దనే ఏఐఎస్ఎఫ్ నాయకులకు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి, ధర్నా చేశారు. ధర్నాలో నాయకులు పాపయ్య, గౌతమ్, రాజు, శ్రీకాంత్, దినేశ్, కౌశిక్, సూరజ్, నిరంజన్ పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలి

చేగుంట, అక్టోబర్ 23: క్యాన్సర్‌పై జాగ్రత్తగా ఉండాలని చేగుంట లయన్స్ డాక్టర్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం చేగుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ వ్యాధి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమం లో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బురుక నాగరా జు, రాంచంద్రం, సతీశ్, సుకేందర్, స్వర్గం సిద్దిరాములు, సూర్యప్రకాశ్, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన నక్షబాట సర్వే పూర్తి చేయాలి



కొంతాన్‌పల్లిలో కబ్జాకు గురైన భూములను పరిశీలిస్తున్న ఏసీ వెంకటేశ్వర్లు

శివ్వంపేట, అక్టోబర్ 23: మండలంలోని కొంతాన్‌పల్లిలో చింతల వెంకటరాంరెడ్డి కొందరి పొలాలకు వెళ్లే నక్షబాటను కబ్జా చేశారని, మాసానికుంట, కరీంకుంటలను ఆక్రమించాడని కలెక్టర్ కార్యాలయంలో గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం కొంతాన్‌పల్లిలో పర్యటించారు. కబ్జాకు గురైన నక్షబాట దారిని, భూములన్నిటిని పరిశీలించారు. రైతులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీలింగ్ భూములు, నక్షబాటను వీలైనంత తొందరగా, పకడ్బందీగా సర్వే చేసి నివేదిక అందించాలని తహసీల్దార్ కమలాద్రిని ఆదేశించారు. సీలింగ్ భూములను కూడా సర్వే చేయాలని ఆదేశించారు. పానాది దారులు, చెరువులు, కుంటలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పార్ట్-బీ భూముల పరిశీలన

నవాబ్‌పేటలో ఎన్నో ఏండ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్న పార్ట్-బీ భూములను అదనపు కలెక్టర్ పరిశీలించారు. నవాబ్‌పేటలో సర్వే నెంబర్ 216, 236, 262, 307, 415లోని భూములను పరిశీలించి, వివాదాస్పదంగా ఉన్న రెవెన్యూ, అటవీశాఖ ఉమ్మడి సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు ఆదేశించారు. ఆయన వెంట ఆర్ఐలు కిషన్, సునీల్, గ్రామస్తులు కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు దేవలింగం, గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులున్నారు.

నిరుపేద విద్యార్థులకు ఆసరా కల్పించాలి

రామాయంపేట, అక్టోబర్ 23: పేద విద్యార్థుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, మెరుగైన వైద్యం అందించాలని లయన్ జిల్లా గవర్నర్ నగేశ్ పేర్కొన్నారు. బుధవారం రామాయంపేటలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభను గుర్తించి, బహుమతులు అందించాలన్నారు. విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్యులు లింబాద్రి, జోన్ చైర్మన్ నాగరాజు, జిల్లా చైర్మన్ యాదగిరి, స్నేహబంధు లయన్స్ క్లబ్ సభ్యులు కందిమల్ల శ్రీనివాసరావు, సాగర్, బాలరాజు, శ్రీనివాస్‌గుప్తా, రజిత్‌రెడ్డి ఉన్నారు.

ఫారెస్ట్ ఆఫీసు ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

కౌడిపల్లి, అక్టోబర్ 23: అటవీ అధికారుల తీరును నిరసిస్తూ మండలంలోని అంతారం జయరాం తండాకు చెందిన రైతు బర్మావత్ రాజు బుధవారం కౌడిపల్లి అటవీ కార్యాలయం ఎదుట డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి కథనం ప్రకారం.. బర్మావత్ రాజుకు మూడెకరాల పొలం ఉంది. ఇల్లు కాలిపోయినప్పుడు దీని పట్టా పాస్ పుస్తకం దగ్ధమైంది. నాలుగు నెలల కిందట ట్రాక్టర్‌తో చదును చేస్తుండగా అటవీ అధికారులు వచ్చి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అప్పటి నుంచి బర్మావత్ రాజు ఫారెస్ట్ కార్యాలయం చుట్టూ తిరిగినా ట్రాక్టర్ ఇవ్వలేదు. కోర్టు నుంచి పర్మిషన్ తీసుకున్నప్పటికీ అధికారులు కాలయాపన చేస్తూ తిప్పుతున్నారు. ట్రాక్టర్ సీజ్ కావడంతో యజమానికి రోజుకు రూ.రెండు వేల చొప్పున కిరాయి చెల్లిస్తున్నాడు. కోర్టు నుంచి రిలీజ్ ఆర్డర్ తీసుకున్నప్పటికీ ట్రాక్టర్ ఇవ్వకపోవడంతో ఆందోళనకు గురై డీజిల్ పోసుకున్నట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై ఫారెస్ట్ ఏఆర్‌వో రాజమణిని వివరణ కోర గా.. అతను డీజిల్ పోసుకున్న మాట వాస్తవమేనని, కావాలనే కార్యాలయం వద్దకు మీడియాను తీసుకొచ్చి డీజిల్ పోసుకున్నాడని పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని సంతకం కావాలని కోరగా, ఆ ట్రాక్టర్ తనదే, తనకే ఇవ్వాలంటూ మొండికేశాడని, ఎంత చెప్పినా వినిపించుకోక ఇలా ప్రవర్తించాడని ఆమె పేర్కొన్నారు. చివరకు ఓనర్‌కు ట్రాక్టర్ అప్పజెప్పినట్లు ఆమె తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చిలిపిచెడ్, అక్టోబర్ 23: మండలంలోని సోమక్కపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విచ్చేయనున్నట్లు సొసైటీ ఇన్‌చార్జి చైర్మన్ రాంచంద్రారెడ్డి తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన మాజీ గ్రామ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొనాలని కోరారు.

నేడు పురుషుల ఫుట్‌బాల్ టీంల ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 23: ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి పురుషుల టీంలను ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఆసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు ప్రకటనలో తెలిపారు. గురువారం మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉదయ 8.30 గంటల నుంచి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి గల క్రీడాకారులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 9347344440, 7730050873 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట, అక్టోబర్ 23: కాట్రియాల వాటర్‌మెన్ మద్దికుంట రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబీకులకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠా రెడ్డి తిరుపతిరెడ్డి బుధవారం అందజేశారు.

రెండు బైకులు ఢీకొని యువకుడు మృతి

బాలకృష్ణ (ఫైల్)

కౌడిపల్లి, అక్టోబర్ 23: రెండు బైకులు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంచాన్‌పల్లిలో జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచాన్‌పల్లికి చెందిన దుంపల బాలకృష్ణ (21) అతని స్నేహితుడితో కలిసి బైక్‌పై మానేపల్లి వెళ్తున్నాడు. గ్రామ శివారులోని బట్టమ్మ గుడి వద్ద మానేపల్లి నుంచి కౌడిపల్లికి వస్తున్న యూనికాన్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి హైదరాబాదులోని నారాయణ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి



మహ్మద్‌మియా(ఫైల్)

పాపన్నపేట, అక్టోబర్ 23: స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో పోస్టల్ ఉద్యోగి మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. యూసూఫ్‌పేటకు చెందిన రిటైర్డు ఉద్యోగి మహ్మద్ మియా(62) పాపన్నపేట మార్కెట్‌కు వచ్చి తిరిగి స్వగ్రామానికి స్కూటీపై వెళ్తున్నాడు. పాపన్నపేట శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

మంచు కురిసే వేళలో..